క్లుప్తంగా

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



అమర్తలూరు(వేమూరు): బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలు మేరకు విద్యార్థులకు చట్టాలుపై అవగాహన కల్పించామని చుండూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని అన్నారు. పాఠశాల విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్య వివాహాల నిర్మూలన, శక్తి మొబైల్ యాప్ అవశ్యకత అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగరం ఎస్ఐ భార్గవ్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరుడ స్తంభం మండపం ఏర్పాటు



కొల్లిపర: కొల్లిపర గ్రామంలోని శ్రీ జనార్ధన స్వామి వారి దేవాలయం ఎదురుగా ఉన్న గరుడ స్తంభం పైమండపం కొన్ని రోజుల కిందట విచ్ఛిన్నమైంది. దీంతో వేద పండితుల సమక్షంలో సోమవారం వేదమంత్రాల మధ్య నూతన మండపం పునఃనిర్మాణం స్థాపించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు గరుడ స్తంభం పైమండపంలో ఉన్న గరుత్మంతుడిని దర్శించి తరించారు.

స్పందించి.. ఆవాసం కల్పించి



సాక్షి ఎఫెక్ట్

తెనాలి, తెనాలి రూరల్: ఓ 'అభాగ్యురాలికి రోడ్డే ఆవాసం' శీర్షికన ఈనెల 15వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మతిస్థిమితం లేని ఒంటరి యువతి రేయింబవళ్లు రోడ్లపైనే తిరుగాడుతున్న వైనం.. ఏదైనా అనుకోనిది జరిగితే కలిగే అనర్థంపై హెచ్చరికతో వచ్చిన కథనంపై తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ స్పందించారు. సోమవారం ఆ యువతి ఎక్కడున్నదీ గుర్తించి గంటల వ్యవధిలోనే జేఎంజే యాజమాన్యంలోని స్వధార్ హోమ్‌నకు తరలించారు. ఆమె దుస్థితిని ప్రచురించిన 'సాక్షి'కి, సమాచారమిచ్చిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తన్నీరు శివశంకర్‌కు, స్పందించిన తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

నాగేశ్వరరావుకు కవి సత్కారం

తెనాలి: విజయవాడలోని ఐఎంఏ హాలులో జరిగిన విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ సభలో జాతీయస్థాయి శతాధిక కవి సమ్మేళనంలో తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు ఆదివారం సత్కారం నిర్వహించారు. 'కృత్రిమ కన్నీరు' అనే వచన కవితను గానం చేసినందుకు ఈ గౌరవం దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు జీవీ పూర్ణచంద్, విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లి రమావతి, సంస్థ గౌరవాధ్యక్షుడు రంగిశెట్టి రమేష్‌లు దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసాపత్రంను ఆయనకు బహూకరించి ఘనంగా సత్కరించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణ మందిరాల వద్ద భక్తులకు అన్నదానం

తెనాలి టౌన్: జన్మాష్టమి వేడుకలు పట్టణ, పరిసర గ్రామాల్లో వాడవాడల ఘనంగా ముగిశాయి. కృష్ణ మందిరాల వద్ద సోమవారం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో మహిళలు, పిల్లలు దేవాలయాలకు వచ్చి స్వామిని దర్శించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా మందిరాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, బీసీ నాయకులు మేడిబోయిన గంగా యాదవ్, నాయకులు పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు.

ఎరువుల కొరత.. తీరేనా వెత!

- వేమూరు మార్కెట్ యార్డులో అరకొరగా ఎరువులు
- ఎరువులు అందక ఇబ్బందులు పడుతున్న రైతులు
- కొరత లేకుండా అందించిన గత ప్రభుత్వం

వేమూరు: ఖరీఫ్ సీజనలో పంటకు ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా ఎరువుల కొరత ఏర్పడింది. వేమూరు మండలంలో యూరియా, డీఏపీ, 20-20, కాంప్లెక్స్ ఎరువుల కొరత నెలకొంది. వేమూరు మార్కెట్ యార్డులో ప్రభుత్వం యూరియా అరకొరగా అందిస్తుందని రైతన్నలు వాపోతున్నారు. డీఏపీ, 20-20, కాంప్లెక్స్ ఎరువులు దొరక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు అధికంగా రావడంతో వరి నాట్లు, వెద సాగు దెబ్బతింది. వరి నాట్లు దెబ్బతిన్న పొలాలకు డీఏపీ, 20-20, కాంప్లెక్స్ ఎరువులు అందడం లేదని రైతులు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో కొరత లేకుండా పంపిణీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఎరువుల కొరత లేకుండా అందించింది. ప్రతి గ్రామంలో గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు గ్రామంలో ఎరువులు సకాలంలో అందించింది. ఎరువుల రవాణా ఖర్చులు కూడా గత ప్రభుత్వమే చెల్లించేదని రైతన్నలు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత పూర్తిగా నెలకొంది. దీంతో రైతులు ఏం చేయాలో తోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం ఎరువులను గ్రామ స్థాయిలో అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మార్కెట్ యార్డులో తెరుచుకోని రైతులకు ఎరువులు అందించే గోడౌన్

కొరత వల్ల ఇబ్బందులు..



ఎరువులు సకాలంలో దొరకకపోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. చావలి గ్రామంలో 17 ఎకరాల పొలం సాగు చేస్తున్నాను. ఎరువులు దొరకకపోవడంతో చాల ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఎరువులు అందించాలి.

గోపాలం రాము, రైతు, చావలి గ్రామం

అరకొరగా యూరియా..



కూటమి ప్రభుత్వం వ్యవసాయ సహకారం సంఘాల ద్వారా అరకొరగా యూరియా అందిస్తోంది. అరకొరగా యూరియా ఇవ్వడానికి కూడా కొన్ని నిబంధలు పెడుతోంది. ప్రభుత్వం రైతులకు నిబంధనలు లేకుండా యూరియా అందించాలి.

విష్ణుమొలకల వెంకటేశ్వరావు, రైతు, చావలి గ్రామం

మోసపూరిత హామీలతో అధికారంలోకి కూటమి ప్రభుత్వం

సూరేపల్లి(భట్టిప్రోలు): మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు అన్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అశోక్‌బాబు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు నేడు సూపర్ ఫ్లాప్‌గా మారాయన్నారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదని.. ఆరోగ్యశ్రీ నీరు గారిందని.. విద్య, వైద్య రంగాల్లో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందని చెప్పారు.



సూరేపల్లి కార్యక్రమంలో పాల్గొన్న అశోక్‌బాబు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనతో కూటమి పాలనను బేరీజు వేసుకుని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, వివిధ విభాగాల పార్టీ నాయకులు గోవర్ధనగిరి పెద బుజ్జి, రావు శేఖరం, జంగం వాసు, నూతక్కి జస్వంత్‌రాజ్, వివిధ విభాగ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ప్రవేశం జీవోపై నిరసన

బాపట్ల: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశంపై జారీ చేసిన ఉత్తర్వుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచవరపు రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ జీవోను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా బాపట్లలో రైల్వే స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించొద్దని కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లోనే విద్యారంగాన్ని పూర్తిగా నీరుగార్చిందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే విద్యార్థి సంఘాలని ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి రాకుండా చీకటి ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సంక్షేమ కార్యక్రమాల గురించి విద్యార్థి నేతలు విద్యార్థులతో మాట్లాడే స్వేచ్ఛ ఉండేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్ల రామయ్య, విద్యార్థి నాయకులు దిలీప్, కట్టా రఘు, కంబాల బన్నీ, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రంతో రవికుమార్

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన

కొల్లూరు: కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల విషయంలో నిర్లక్ష్య ధోరణి విడనాడి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొల్లూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి లోకేష్ ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు అందజేస్తామన్న హామీని తక్షణం అమలు చేయాలని నినాదాలు చేశారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన ప్రదర్శన చేపట్టి తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమకు జీవనాధారం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బొనిగల సుబ్బారావు, ఆటో యూనియన్ నాయకులు రాజు, రాజేష్, విజయ్, నాంచారయ్య, శ్రీను, శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి

చెరుకుపల్లి: రేషన్ దుకాణాదారులు తప్పని సరిగా సమయ పాలన పాటించి కార్డు దారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చెయ్యాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్‌కే గాలీభాషా ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని రేషన్ డీలర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ.. ప్రతి రేషన్ డీలర్ వృద్ధులకు 26వ తేదీ నుంచి నెల చివరిలోపు తప్పని సరిగా వారి ఇళ్లకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ లోపు కార్డు దారులకు సరుకులు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రతి డీలరు రోజూ స్టాక్ బోర్డు సక్రమంగా రాసి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, సీఎస్‌డీటీ ఓంకార్, జిల్లా రేషన్ డీలర్స్ అధ్యక్షుడు రవిచంద్రా రెడ్డి, మండల రేషన్ డీలర్స్ అధ్యక్షుడు నాగుల పున్నారావు, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో గాలీ భాషా

పంటల నష్టం ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలి

విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని రైతుల వినతి

తెనాలి: అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను వెంటనే ఎన్యూమరేట్ చేసి, ఎకరాకు రూ.10 వేలు పరిహారం, ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులతో కలిసి సంఘ నాయకులు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వరిపాలన అధికారి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గత 12వ తేదీన కురిసిన భారీవర్షం కారణంగా తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు మండలాల్లోని రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని.. రెండోసారి వెదజల్లిన వరి కూడా అధిక వర్షానికి నీట మునిగిందని.. పసుపు, కూరగాయలు, ఆకుకూరలకు నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు. రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ.. సాగుభూమి రీలోకలైజేషన్‌ను చేపట్టాలని తెలిపారు. నాయకులు ఎస్.భావనారాయణ, షేక్ హుస్సేన్‌వలి, రైతులు కళ్లం శ్రీనివాసరెడ్డి, ఎన్.సుబ్రహ్మణ్యం, తమ్మా శివరాం, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ ఇస్తున్న రైతులు

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి

తెనాలి అర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ఆదేశించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సిబ్బందికి సూచనలు చేశారు. రోజూ కాలువలను కూడా బాగు చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

తెనాలి అర్బన్: ఐతానగర్ బ్యాంకర్స్ కాలనీలో మురుగు కాలువల నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారని.. కానీ నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని.. పనులు ప్రారంభించే విధంగా చూడాలని ఆ ప్రాంత వాసులు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావును కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు, పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు తొలగించాలనిపలువురు వినతిపత్రాలు ఇచ్చారు.

ప్రభావతికి కవయిత్రి అవార్డు



భట్టిప్రోలు: విశ్వ సాహితీ కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భట్టిప్రోలు వాసి కవయిత్రి దొంతు ప్రభావతి అవార్డును అందుకున్నారు. సోమవారం విజయవాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ ఆవరణలో ఈ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కళావేదిక అధ్యక్షులు కొల్లి రమావతి ఆధ్వర్యంలో ట్రిపుల్ గిన్నీస్ ప్రపంచ రికార్డ్ అవార్డు గ్రహీత మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రభావతి అవార్డును అందుకున్నారు. పలువురు ఆమెను అభినందించారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



బాపట్ల: సింగపూర్‌లో 1943లో స్వతంత్ర్య భారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ధీశాలి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 81వ వర్ధంతిని సోమవారం స్థానిక విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. ఆనాడు నేతాజీ భారత సైన్యాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఆయన అనేక దేశాలు సందర్శించి, వారి మద్దతుతో దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పాటుపడ్డారని తెలిపారు. జైహింద్ నినాదాన్ని జాతికి అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, న్యాయవాది టి.భాస్కరరావు, నాయకులు బొట్టు కృష్ణ, గోపి, సురేష్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల చట్టాలను పటిష్టంగా అమలుచేయాలి

తెనాలి: తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం–2007తో పాటు సీనియర్ సిటిజన్స్ ప్రాణ ఆస్తి సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్స్ జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ సిటిజన్స్‌పై ముఖ్యంగా ఒంటరి వృద్ధులపై జరుగుతున్న వేధింపులు, దోపిడీలు, హత్యలు, మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. అనంతరం తెనాలి డీఎస్పీ కార్యాలయంలోనూ వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పావులూరి రాంబాబు, ఆర్.భుజంగరావు, పి.మల్లికార్జునరావు, ఎం.అర్జున్, బోస్, ఆర్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే ఉపేక్షించం



నగరంలోని ఎరువుల దుకాణంలో ఏవో రమేష్‌బాబు

నగరం: ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రమైన నగరంలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో ఉందన్నారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించమని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పెదపూడి గ్రామంలో ఎరువులు తనిఖీ చేస్తున్న ధనరాజు

అమర్తలూరు(వేమూరు): ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజు తెలిపారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఎరువులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. మండలంలో 120 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ 140 మెట్రిక్ టన్నులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత భరత్, ప్రాథమిక వ్యవసాయ సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి రవీంద్ర, సొసైటీ సీఈవో వెంకటేశ్వరరావు, శంకరరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు డి.మాధవి, బి.మణికంఠ, కె.తిరుపతమ్మ పాల్గొన్నారు.



కొల్లూరులో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో నరేంద్రబాబు

బిల్లులు లేకుండా కొనుగోలు చేయరాదు..

కొల్లూరు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి వి.నరేంద్రబాబు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో స్టాక్ నిల్వలను పరిశీలించారు. దుకాణదారులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

పీఏసీఎస్ రైతులకు వ్యవసాయ రుణాల పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రైతులకు వ్యవసాయ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో రైతులకు చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుల చేతుల మీదుగా రుణాలు పంపిణీ చేశారు. పీఏసీఎస్ పరిధిలోని 85 మంది రైతులకు సీసీ, వ్యవసాయ రుణాల కింద రూ.5.31 కోట్లు రైతులకు అందజేశారు. భట్టిప్రోలు సంఘంలోని బొజ్జా ఏసుబాబు రైతు ట్రాక్టర్ ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కింద రూ.2 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రమేష్, వేమూరు మార్కెటింగ్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జిల్లా జీడీసీసీబీ అధికారులు, సిబ్బంది, భట్టిప్రోలు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.



రైతుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రహదారులు జలమయం



నేతాజీనగర్‌లో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నియోజకవర్గంలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వర్షపునీరు నిలిచింది. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ పట్టణంలో కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపునీరు నిలువడంతో వాహన చోదకులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా నిజాంపట్నం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, బసవేశ్వర థియేటర్ రోడ్డులలో వర్షంనీరు నిలిచింది. రేపల్లె పట్టణంలో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. నిజాంపట్నం 32.8 మి.మీ.. నగరం మండలంలో 29.4 మి.మీ.. చెరుకుపల్లి మండలంలో 22.0 మి.మీ.. వర్షపాతం నమోదయ్యింది.

రేపల్లె

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఏవో ఆర్.విజయబాబు



దుగ్గిరాల: మండలంలోని రైతులకు ఇప్పటివరకు ప్రభుత్వ సొసైటీలు, ప్రైవేటు దుకాణాల ద్వారా 782 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశామని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగు 20 వేల ఎకరాలలో సాగవుతున్నదని, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా వరి వేశారని అన్నారు. 19వ తేదీకి సొసైటీలకు 80 మెట్రిక్ టన్నుల యూరియా, 100 మెట్రిక్ టన్నుల డీఏపీ, రైతు సేవా కేంద్రాలకు 46 మెట్రిక్ టన్నుల యూరియా, 15 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.